# ప్రసాదం

వేంకటేశ్వరస్వామి 'లడ్డూ' ప్రసాదమంటే భక్తులకు అపరిమితమైన ఇష్టం!

స్వామిని దర్శించి 'లడ్డూ' ప్రసాదం సేవిస్తే పంచమహాపాతకాలూ పటాపంచలవుతాయనేది భక్తకోటి నమ్మిక!

దేవస్థానంవారు ఉచితలడ్డు గోళికాయంత సైజులో వున్నా... అర్జిత సేవలు చేయించిన భక్తులకు పెద్దసైజు లడ్డూలే ముట్టచెప్పటం ఆనవాయితీ!

కొండ మీద లభించేవన్నీ స్వామివారికి నైవేద్యం పెట్టి బాహాటంగా ప్రాంగణం బైట అమ్మే లడ్డూలేననుకుంటే పప్పులో కాలేసినట్టే.

అనేకులు లడ్డూలు తయారుచేసి ప్లాస్టిక్ కాగితాల్లో సీలుచేసి శ్రీవారి ప్రసాదం అనేసి అమ్మటం కద్దు! ఈవిధమైన మోసపూరిత వ్యాపారులను దళారులను దేవస్థానంవారు అడ్డుకుని నివారించలేకపోవటం... వారి చేతగాని తనానికి నిదర్శనం.

కొంతకాలం క్రితంవరకు శ్రీవారి లడ్డూలో కలకండముక్కలు... కిస్మిస్... జీడిపప్పు... స్వచ్ఛమైన నేతి ఘుమఘుమతో అమృతతుల్యంగా వుండేది.

భక్తుల సంఖ్య పెరుగుతున్నా... దేవుని ఆదాయం కోట్లలో వున్నా లడ్డూల్లో క్వాలిటీ తగ్గిందనేసి నిర్వివాదాంశం.

అన్నిటికీ సర్దుకుపోయే గుణం భక్తులకు వున్నది కనుక లడ్డూ ప్రసాదంలో క్వాలిటీ తగ్గినా... స్వామి వారి ప్రసాదం కదాని కళ్ళకద్దుకు తినేసి తృప్తిపడుతున్నారు.

శ్రీవారి లడ్డూలు తయారు చేయటంలో మిరాసీ దారులు ఒకప్పుడు సిద్ధహస్తులు!

వారి చేతులమీదుగా అలనాడు లడ్డూలు చేసినపుడు వున్న రుచి కమ్మదనం ఇప్పుడు కరవై కనుమరుగైంది!

★★★★★

తిరుమల తిరుపతి దేవస్థానంలో పాలకమండలులు ఎన్నో మారాయి! స్వామిసేవలో భక్తి ప్రపత్తులు మృగ్యమైనయ్! రానురాను రాజకీయ జోక్యం ఎక్కువైనందున పాలకవర్గంలో అలసత్వం నిర్లక్ష్యం పాళ్ళు అధికమైనయ్!

కొండమీద పేరుకే పోలీసులు! దైవసన్నిధిలో పనిచేస్తున్నామనే శ్రద్ధ కనుమరుగై అవినీతి చోటు చేసుకోవటం భక్తులకు తెలుసు! ఆ వేంకటేశ్వరునికీ ఎరుకే!

శ్రీవారి లడ్డూల్లో పూర్వపు రుచి లోపించినా భక్తజనం వాటికోసం ఎగబడటం ఎక్కువైంది! కౌంటర్స్‌లో లడ్ల అమ్మకం ప్రారంభమై వ్యాపారపు రంగు పులుముకోవటం గర్హనీయం!

ఏటా స్వామి ఆదాయం కోట్లలో వున్నప్పుడు లడ్డూల తయారీలో క్వాలిటీ ఎందుకు తగ్గాలి? అనేది ప్రశ్న. అదీకాక లడ్డూలు విక్రయించటమేమిటి విడ్డూరం కాకపోతే? ఆయనకేం తక్కువని ఈ విధమైన వ్యాపార ధోరణి?

ఈ విషయాలపట్ల శ్రద్ధ కనపరిచేవారే కరువైనారు.

★★★★★

ఒకానొకనాడు లడ్డూలు లక్షల్లో అమ్ముడుపోగా మరికొన్ని వూరికే పంచిపెట్టటం జరిగేది.

శ్రీవారి లడ్డూల్లో పటికబెల్లం పంచదారకు బదులుగ గాజుపెంకుల చూర్ణం కలిపారనే విషయాన్ని భక్తులు గ్రహించలేకపోయినా పేపర్లవాళ్ళు ఆ విషయాన్ని పసికట్టి బహిర్గతం చేసి దుమారాన్ని లేపారు.

ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఈ విషయం యావత్ ప్రపంచానికీ తెలిసిపోయింది.

గాజుపెంకులచూర్ణంతో తయారైన లడ్డూలు సేవించిన వారందరూ అనేక చోట్ల అనారోగ్యం పాలైనారు.

ఇది ఎన్నడూ కనీవినీ ఎరుగని ఘోరకలి!

ఇంతటి దుర్మార్గానికి కారకులైన సంఘ విద్రోహశక్తులను పట్టుకోవాలని ప్రభుత్వం దేవస్థానం అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది.

ఆరోజు అమ్ముడుపోగా మిగిలిన లడ్డూలను అసలీ విషయం నిజమా అబద్ధమో తేల్చాలని లేబరేటరీ టెస్ట్‌కి పంపేరు.

దేవస్థాన పాలకవర్గ సభ్యుల్లో భయం గుండెదడ మొదలైనయ్. గుండెల్లో రైళ్ళు పరుగులెత్తుతున్నయ్!

ఈ ఘోరం ఎంత కాలంగా జరుగుతోంది? దీనికి కారకులెవరు? బాధ్యులెవరు? ఇంతటి దారుణం ఎందుకు చోటు చేసుకుంది.

ఇదంతా అసలు నిజమో కాదో అసత్య ప్రచారం జరుగుతున్నదేమో?

కోర్టు ఉత్తర్వుల ప్రకారం మిరాసీదారుల కేసు వీగిపోయినప్పటినుండి శ్రీవారి లడ్డూల తయారీలో ఎటువంటి ఫిర్యాదులూ లేవు.

అలాంటిది ఇప్పుడిలా ఎందుకు జరిగింది?

అందరూ శ్రీవైష్ణవులే...! కానీ ఈ దుర్ఘటన ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? దీనివల్ల ప్రయోజనం ఎవరికి?

భక్తులను భయభ్రాంతులను చేయటానికి ఇదొక విద్రోహచర్య కాదు కదా?

ఈ పరిస్థితుల్లో శ్రీవారి 'లడ్డూల' తయారు చేసే ప్రయత్నం తాత్కాలికంగా నిలుపుదల

చేయటం జరిగింది.

దీనిపై భక్తులనుండి పాలకమండలి నిర్ణయంపై దుమ్మెత్తిపోయటం... నిరసనలు మొదలైనయ్.

ప్రతిపక్షాలు ఈ సమస్యపై మరింత ఆజ్యం పోసే ప్రయత్నంలో నిమగ్నమైంది.

భక్తులరద్దీ తగ్గినందుకు పాలకమండలిలో కలవరపాటు! క్యూ కాంప్లెక్స్‌లు బోసిపోతున్నయ్. సత్రాలలో భక్తుల రద్దీ లేకపోవటంతో వెలవెలపోతున్నయ్.

రాష్ట్రంలోనేకాక... యావత్ భారతదేశంలో దీనిపై కలవరం!

శ్రీవారి ఆదాయం లక్షల్లోంచి వేలల్లోకి పడిపోవటంతో అందరూ నివ్వెరపోయారు.

ఈ దుశ్చర్యకు తామే కారకులమంటూ ఏ వుద్యమాల వారు.. దుష్టశక్తులు పేపర్ ప్రకటన ఇవ్వలేదు.

పాలకమండలి అసమర్థతే కారణం కనుక... మండలిని రద్దు చేయాలంటూ అప్పోజిషన్ పార్టీలన్నీ ఏకమై గొంతులు చించుకుంటున్నాయ్.

దేవుడు ఆగ్రహించాడు... కనకనే ఎన్నడూలేని విధంగా పాపం జరిగింది. కలియుగ అంతానికిది సంకేతం కాబోలు అనే అభిప్రాయాలు ప్రచారంలో కొచ్చినయ్.

ఇలా జరగటం దురదృష్టకరమని...' ఈ విషయంలో పాలకమండలి బాధ్యతేమీ లేదనే వారి వాదన గట్టిగా విన్పిస్తోంది.

నిత్యాన్నదాన పథకం కింద వేలాదిగా భోజనాలు చేసేవారి సంఖ్య గణనీయంగా తగ్గింది. అందరికీ అనుమానమే! ఎందులో ఏం కలిసిందోననే భయం భక్తుల్లో తొంగిచూస్తోంది.

పత్రికలు ఈ ఘటనపై పాలకమండలిని ప్రభుత్వాన్నీ వుతికి ఆరేస్తున్నాయ్. ఎలక్ట్రానిక్ మీడియా రెచ్చిపోయి ప్రకటనలు గుప్పిస్తోంది.

ఇది ప్రభుత్వ అసమర్థతే అంటూ కొందరు... రూలింగ్ పార్టీ రాజీనామా చేయాలని మరికొందరు వాదనలు గుప్పిస్తున్నారు.

ముఖ్యమంత్రి... దేవాదాయశాఖామంత్రివర్యులు దేవస్థానం ఛైర్మన్, ఇ.వో. ఈ విషయంలో అధైర్యపడకుండా బింకాన్ని ప్రదర్శిస్తూనే వున్నారు.

★★★★★

ప్రసాదంసేవించిన అనేకమంది భక్తులు చనిపోవటం... పోస్టుమార్టం రిపోర్ట్‌లో గాజుపెంకుల పొడి కడుపులో వున్న కారణాన పేగులను అవి కోసేసినందువల్లే మృత్యువాత పడ్డారనే రిపోర్ట్ నలుమూలలనుండి సునామీలా విరుచుకుపడడంతో ప్రాబ్లమ్ మరింత జటిలమైంది.

ఎవరి గొంతుకలకు ఉరితాడు బిగుసుకుంటుందేమోనే భయం పాలకమండలివారిలో మొదలైంది.

కాలయాపనతో ఈ విషయాన్ని హుషప్ చేయటానికి తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో... ఇది హిందూ సాంప్రదాయాలకు చెందిన విషయం కావటంతో... దేశం నలుమూలలనుండి నిరసనల వెల్లువల హోరెత్తుతున్న కారణాన ప్రధానమంత్రి స్వయంగా ఈ సంఘటనపై జోక్యం చేసుకుని నిజ నిర్ధారణ కమిటీ నొకదానిని ఏర్పరచి... సంపూర్ణ విచారణ జరపాల్సిందిగా ఆదేశాలివ్వటం జరగటంతో అటు పాలకమండలి ఇటు రాష్ట్ర ప్రభుత్వం కుడితిలో పడ్డ ఎలుకలా విలవిల్లాడిపోతున్నారు.

జరిగింది దారుణమనీ... వేలాదిమంది భక్తులు ప్రసాదం తిని ప్రాణాలు పోగొట్టుకున్నారనే విషయం బహిరంగంగా యావత్ ప్రపంచానికీ తెలిసినా... ఎంక్వైరీ రిపోర్ట్ తారుమారుచేసి ప్రజలను భయపెట్ట ప్రయత్నిస్తున్నాయ్ కొన్ని దుష్టశక్తులు!

అందరూ ఏకమై నిజనిర్ధారణ కమిటీ చేపట్టిన ఎంక్వైరీకి అడుగడుగునా అడ్డుపడటం... కేసు విచారణ ముందుకు సాగనీయకపోవటంతో అసలు యదార్థమేమిటో? ఎందుకు ఇలా జరిగిందో... దీనికి మూలకారకులెవరో? అనే ప్రశ్నలకు జవాబులు దొరకవేమోననే శంక భక్తులను పట్టి పీడిస్తోంది.

మరోవైపు 'లడ్డూ' ప్రసాదాన్ని నిలుపుదల చేయటంతో భక్తుల్లో ప్రజానీకంలో పలు అనుమానాలకు తావిచ్చినట్టవుతోంది.

మిరాసీ చట్టం రద్దు కావటంతో ఒకప్పటి పాలకమండలి... స్వామివారి లడ్డూలు తయారు చేయటాన్ని బైట వ్యక్తులకు వప్పగించాలని ఆలోచించి నిర్ణయం తీసుకుంది.

ఇంకేముంది అప్పటి దేవస్థానం ఛైర్మన్ ఆశ... ఆశయం నెరవేరినట్టయింది.

లక్ష లడ్డూలు తయారు చేయటానికి ఖర్చు ఎంత అవుతుందో అంచనా వేసి టెండర్ల ద్వారా ఏర్పాటు ఖాయం చేయాలనే పాలకమండలి ఆలోచన కార్యరూపం దాల్చింది.

దేవస్థానం పాలకమండలి నిర్ణయంపై అనేకానేక విమర్శలొచ్చినా... ప్రభుత్వం అండదండలు వున్నందున 'లడ్డూలు' తయారీ ప్రతిపాదన బైటి సంస్థలకు వప్పగించాలనే నిర్ణయం ఆచరణలోకొచ్చింది.

టెండర్లు పిలవగానే దేశం నలుమూలలనుండి స్వీట్స్ తయారుచేసే కంపెనీలు తమ కొటేషన్లను పంపుకోవటం జరిగింది.

అసంఖ్యాకంగా వచ్చిపడ్డ టెండర్ల పరిశీలనకే నాలుగునెలలకాలం పట్టింది.

రాజకీయ పలుకుబడి కలిగిన వ్యాపారస్తులు టెండర్ తామే దక్కించుకోవాలని విశ్వ ప్రయత్నం చేయటం మొదలైంది.

చివరికి ఎలాగైతేనేం... లడ్డు వుండవలసిన తూకం... అందులో వాడవలసిన సుగంధ ద్రవ్యాలు... విక్రయధర మొదలైన వాటిపై ఇరుపక్షాలవైపు సంభాషణలు జరిగి చివరికి ముంబైకి చెందిన ప్రముఖ స్వీట్స్ వ్యాపారవేత్త టెండరు ఖాయపరచుకోవటంతో అతనికే

వర్క్ ఆర్డర్ ఇవ్వటం జరిగింది.

అప్పటినుండి నిరాటంకంగా పదేళ్ళపాటు బొంబాయి సేఠ్‌ల 'లడ్డూలు' చేస్తూ దేవస్థానం వారికి అందచేయటం సజావుగా జరుగుతోంది.

అగ్రిమెంట్ కాలం ముగిసేక మళ్ళీ టెండర్లు పిలవగా... ఈసారి మంత్రిగారి బావమరిది వర్క్ ఆర్డర్ చేజిక్కించుకున్నాడు.

ఆర్డర్ తనకొచ్చినందుకు పది లక్షలు పార్టీ ఫండ్ కింద ఇచ్చేసి పళ్ళికిలించాడు.

అప్పటినుండి 'లడ్డూ' తయారింపుతో అనేకానేక లొసుగులున్న కారణాన దేవస్థానం విమర్శల పాలైనప్పటికీ చూచీ చూడనట్టు వ్యవహరిస్తుండటం మరో తప్పిదం.

రానురానూ స్వామివారి 'లడ్డూల్లో' రుచి తప్పింది. జీడిపప్పు మచ్చుకైనా కన్పించటంలేదు. పచ్చకర్పూరమనేది వాడటం పోయింది. కిస్‌మిస్‌లూ అంతంత మాత్రమే!

కమ్మటి నేతివాసనల ఘుమఘుటలాడే లడ్డూలు నూనె వాసనకు గురై రెండుమూడు రోజులకు మించి నిల్వ వుండకపోవటం భక్తులు గమనిస్తున్నా... ఫిర్యాదులిస్తున్నా... వెనుకటి రుచి ప్రాభవం లేకపోవటం తమ దురదృష్టమని భక్తులు సరిపెట్టుకోకతప్పటంలేదు.

లడ్డూల టెండర్ తాలూకు కాంట్రాక్టర్ కనకయ్యకి ధనదాహం మితిమీరి... అధికారవర్గంతో లాలూచీపడి... చివరికి పటికబెల్లం... చక్కెరలో ఒక వంతు గాజుపెంకుల చూర్ణాన్ని మిళితం చేసి 'లడ్డూలు' తయారుచేసి దేవస్థానానికి అందచేయటం మూలానే ఇంతటి అనర్థం వాటిల్లిందనే యదార్థం కేంద్రంనుండి వచ్చిన నిజనిర్ధారణ కమిటీ తమ విచారణలో నిగ్గు తేల్చింది.

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కాంట్రాక్ట్ తీసుకున్న కనకయ్యపై కేసు బనాయించటం జైల్లో తోయించటం జరిగింది.

ఇ.ఓ.గారిని ఆఘమేఘాలమీద బదిలీ చేసి బోర్డును రద్దు చేసేటందుకు చర్యలు తీసుకుంది ప్రభుత్వం.

దేవస్థానం ఛైర్మన్‌ని తొలగించి తరువాత ఆయన్ను ఎన్నికలలో ఎం.పి. సీటు ఇచ్చి గెలిపించి పార్లమెంట్‌కి పంపటంతో కేంద్రమంత్రి వర్గంలో కేబినెట్ హోదా పదవి చేజిక్కించుకునే అదృష్టం ఆయన్ను వరించింది.

మరో వ్యాపారికి టెండర్ ఖాయంచేసి 'లడ్డూల' తయారీ కాంట్రాక్ట్ అప్పగించటంతో... లోగడ జరిగిన ఘోరాన్ని భక్తజన కోటి విషయాన్ని మర్చిపోయి ప్రసాదం దొరుకుతున్నందుకు చంకలు గుద్దుకున్నారు.

- సమాప్తం -